ఎక్సురే ఇలా

# పత్నీవ్రతం

"విహారి"

సతికి పతికంటే వేరే దైవమేలేట్ట. కట్టుకున్న వాణ్ణే త్రికరణశుద్ధిగా నమ్మి సేవించుకుంటే, స్త్రీకి యిహమూ, పరమూ కరతలామలకంట. బాగానేవుంది. దీనికితోడు పత్నికంటే వేరే పరదేవత లేదు; కట్టుకున్న దాన్ని త్రికరణశుద్ధిగా నమ్మి సేవించుకుంటే పురుషుడికి యిహమూ, పరమూకరతలామలకం, అనివుంటే యెంతో బాగుండేది" అన్నాడు. ఆమధ్య వొహాయన.

"కాని యిది మాత్రం లేదని చెప్పడానికి అవకాశం యెక్కడుంది? అది రాసి పారేసిన పక్షపాతం యెరగని పెద్దలు యిది మాత్రం యెందుకు రాసేశుందరు? యిష్టం లేని అన్నిటికి మల్లే మొగపురుషులు దీన్ని, ఆక్రమించదలుచుకున్న భూమిలా కొన్నాళ్లు పాతాంతరంకిందా, కొన్నాళ్ళు పక్షాంతరం కిందావుంచి మెల్లిగా తుడుపు పెట్టుంటారు. యింతచేసినా 'యింటిపట్టున పందిరీ—పొయిపట్టున బూడిదా' అన్నట్టుగా యింకా "నాతిచరా" మ్యాదులు వొకట్రొండు, పరశురామయ్యగారి పాతగొడ్డలి పాలుగాకుండా మిగిలుండబట్టే, పంతులు వీరేశలింగంలాంటి వాళ్ళకి కాస్త పాకులాడ్డానికి అవకాశం కలిగింది" అన్నాడు జవాబుగా మరొహాయన

యీ అనుమానాన్ని రూఢిగాచేసుకుంటూ రొండు లింగాల్లోనూ చాలామంది పురుషులు స్వార్థపరులనీ. ఆడవాళ్ళకి తీరని అన్యాయం చేశారనీ, దుమ్ము తూర్పారబట్టారు. పడుతున్నారు కూడా: కాని యిలా అనుమానాన్ని ఆధారంచేసుకొని పురుషపుంగవుల్ని నిందింపటం ఘోరమైన అన్యాయమని మనవి.

యావన్నారయా మన పెద్దలూ? "తమ కార్యంబు పరిత్యజించియు పరార్థ ప్రాపకుల్ సజ్జనుల్" అనిగదా! దీన్ని కాదంటానికి యేమైనా వీలుందా? అలాంటప్పుడు మొగాళ్ళుచేసుకున్న తప్పేముంది? యెవరైనా వొక పనిని కాదని, రొండు పనుల్ని డైవైడెడ్ మైండుతో చెయ్యాలంటే అని సరిగా అయి యేడుస్తాయా? 'రెంటికిం జెడిన రేడు' అయిపోతాడు. అందుకనే తన పని యెలావున్నా, దాని ముందామోసిరి లెమ్మని పదార్థం కోసమే పాకులాడి, తద్వారా వుచితంగా లభించే పేరు ప్రతిష్ఠల్తోపాటు పరంగూడా బొక్కలాడ గలుగుతున్నాడు వాడు.

చెట్టపట్టాలవారు మొదలు చేతులు కాయలు కాసేదాకా నీరు తోడేవారివరకూ, రాధేలవారి దగ్గర్నుంచి ఛీ—ధూల వారివరకూ చాలా మట్టుకు యిదే పరాకాష్ఠ. తన శీలం యేగంగలో కలిసినా, మర్యాద మన్నుపాలైనా హిజ్‌వైఫ్ (అంటే అతని ధర్మపత్ని అన్నమాట) గారియొక్క శీలానికీ, మర్యాదకూ యెక్కడ కాసంత కళంకం అపాదించడానికి ఆస్పదమౌతుందోనని, వేయి కళ్ళతో తనికీచేస్తుంటాడు వాడు. ఆఫీసులోవున్నా, అమెరికాలోవున్నా యీ వ్యవహారమే బుర్రలో టంయ్—టంయ్ లాడుతుంటుంది. దీనికి సుషుప్తి అనేదే లేదు. యిన్ని మాటల్తో లాభవేం చివరకి దక్షిణాది బిళ్ళ జవాన్లొచ్చి "హల్లో మిష్టర్, తాకీదొచ్చింది లేవాలి" అని తొందర పరిచే సమయంలోకూడా తన అబ్సెన్సులో తన సహధర్మచారిణి పాతివ్రత్యానికి యేమైనా లోటు కలుగుతుందేమోనే బెంగతోనే నశికి, గుమ్మం దాటుతాడు బ్రహ్మప్రళయం మీద, విధిలేక. వొచ్చిన ముండావాళ్ళ కింత చెయ్యి తడిజేశో, కడుపు చల్లచేశో పూళ్ళో హాజరు లేడనిగాని, వునికి తెలీదనిగాని రాయించి పంపించే ప్రయత్నంగూడా చేసేవాడేగాని, ఆ వొచ్చిన బంట్రోతులు నాగరికతా గట్రా అంటే యేవిటోగూడా యేనాడూ యెరగని రాతియుగం రకం మనుషులు కావడంవల్ల పాచిక పారకుండా వొస్తూంది.

అయితే దీనికి ఎక్సెప్షన్ లేకపోలా! యేది యెలాపోయినా సరే తన కింత మృష్టాన్నమూ, పుష్కలంగా పైసా—వొస్తే చాల్ననుకునే మహానుభావులు కూడా వున్నారు, మాడరేట్లూకూడా లేకపోలా. అయితే పరసెంటేజి చాలా లోగావుంటుంది.

ప్రాయికంగా యీ భేదాలు వయస్సును బట్టి కలుగుతుంటాయని బుద్ధిమంతులు శెలవిస్తుంటారు. పెత్తనం వొచ్చాక పెళ్ళిచేసుకున్న పెద్దలకి యీ పదార్థచింత మెండని, వాళ్ళ అభిప్రాయం. న్యాయమే! శేషించి వుండే అల్పవయః కాలంలోనే అవకాశం వున్నంతవరకు పరార్థంలో గడపాలనే చింతే అలా చేయిస్తుంటుంది. అందుకనే వాళ్ళు వో క్షణమైనా యింటావిణ్ణి దృష్టిపథం దాటిపోకుండా వుండేలా చుట్టుకొని తిరుగుతుంటారు. మట్టి బుర్రలోకం యీ స్వార్థరహిత పూర్వకమైన సత్తువి తెలుసుకోలాక, యెన్నెన్నో అపార్థాలు కల్పిస్తుంటుంది.

పూర్వోక్త విషయంలో వయోవృద్ధులకి యే మాత్రం పేరూ ప్రతిష్ఠావున్నా రియాలిటీలో కాంపిటీషన్‌వొస్తే, పిన్నలే కొట్టేస్తారేమోననే విశ్వాసంవుంది. దీనికి తగిన ఆధారం లేకపోలా! ఆవర్కహూవ

వుదహరించాలంటే యీ విషయంలో 'ఓం ప్రథమం' గున్నాధరావుగార్నే చెప్పి తీరాలి.

వీరి పెద్దలు అఖండమైన భూస్వాములు. అంతా జమీందారీ కత్తు! దివాణంలో మూడు వేళ్ళా నగారా మోగుతుండేది; ఎక్కడి కెళ్ళినా బగ్గీ! బరాబర్లూ!! బహుపరాకులూ!!! 'దేహీ' అంటే 'నాస్తి' అనేమాటేలేదు. సింహద్వారంలో వోయేనిగున్నా, వో పావు డజను పంచకల్యాణి గుర్రాలూ, వెంటాంటే మాంచి జాగిలాలూ, దేగలూ హాజర్. అంతా నిత్యకల్యాణం పచ్చతోరణం!

కాని యెవరి అదృష్టం వారిదే. గున్నా రావుగారి బాల్యంలోనే పై హంగామీ అంతా తగ్గి అంతా మామూలు పద్ధతిగా మారింది. చివరకి రావుగారికి పిల్లనిచ్చే వారుకూడా అరుదై పొయ్యారు. ఐనా, పూర్వ వాసన పోకుండా యింగువ కట్టిన బట్టకు మల్లే వున్న దాంతో డాబుసరికి లోపం రాకుండా, వుభయఖర్చులూ యేదోవిధంగా తానేభరించి, యీసంగతి పిట్టకైనా తెలీనీకుండా మాంగ ల్యపుతంతు జరుపుకున్నాడు. అమ్మగారితో పాటు పెద్దమ్మగారుగూడా గృహప్రవేశం చేసింది. దివాణాలు దివాణాలతీరున్నే వున్నాయిగాని వెనకభాగంలో రెండు గదు లుతప్ప తతిమ్మా యావత్తూ రుణదాతల వశమై పొయ్యాయి. పొలాలమీద యీలాలు తిరిగాయి. వెనకటి బగ్గీ సవారీలస్థానే వో వొంటెద్దు శకటం మిగిలిపోయింది. గడ్డీ గాదం విచారించే నాథుల్లేకపోయినా, ప్రారబ్ధరుణశేషం యింకా తీరకపోవడం వల్ల, ఆ బక్కగోద వాకిట్లో మెడకు పురి పోసుకొని, వాగిరిస్తూ వుండిపోయింది. వెనకటి మంగళవాద్య స్థానంలో వో శల్యా వశిష్ట గ్రామసింహం సజీవంగావుంది. అది పగలంతా యెండకు యెక్కణ్ణో పడుండి శక్తిసేకరించుకొని, రాత్రికాగానే కొంపమీది కెక్కి నక్కల్ని యిమిటేట్‌చేస్తూ, తెల్ల వార్లూ అయ్యో......! అనే శబ్దంతో దిక్కుల్ని మారుమోగిస్తూ పహరా యియ్య సాగింది.

సర్వసంపదలూ యిలా అదృశ్యమై పోయినా యిల్లాలి కడుపు చల్లగా పది కాయలుకాశాయి. అదే పదివేలు. యీ మార్పుకంతా కర్మే, కారణమని ఆ దంప తుల విశ్వాసం, కాని లోకందాన్నే భంగ్యం తరంగా 'దీనికంతా రావుగారూ వారి తండ్రి గారూ చేజేతుల చేసుకున్న కర్మేకారణ' మంది. సత్యం సర్వాంతర్యామికే తెలియాలి.

"యింట్లో తినేవాళ్ళ సంఖ్య డజనుకు దాటింది. రాచరికానికి లోపంరాకుండా తిన్నన్నాళ్ళు యెలాగో తిన్నాం. లేనిపోని భేషజాలు పెట్టుకుంటే సాగదు. కాబట్టి యేదో నౌకరీ చూచుకోండి" అని అనేక కారణాలతో సలహాయిచ్చింది యిల్లాలు. కాని రావుగారికి యిది సుతరామూ యిష్టం లా, అల్లా యిష్టం లేకపోవడానిగ్గూడా అనేక రకాలైన కారణాలున్నాయి. మొద టిది: అమ్మయ్యగార్ని యే కారణంచేత నైతేనేం వొంటరిగా వొకక్షణమైనా విడిచి వుండడం యిష్టం లేకపోవడం. రెండోది: తాను స్కూలు ఫైనల్‌వరకూ దేకానని డాబులుకొట్టినా, ఫష్టుఫారంతోటే చదువు వల్లకొట్టడం. యిలాంటివివున్నాయి చాలా, అయితే అన్నీ సెకండరీ రకమే.

రావుజీకీ అమ్మాయిగారికీ వయస్సులో ఆట్టే భేదంలేదు, రెండు మూడుకంటే. అయినా స్త్రీ విషయంలో అలాంటి అనిర్వచ నీయమైన భక్తి కుదిరి, సర్వకాల సర్వావ స్థల్లో సేవించుకొని తరించే పట్టుదల అంద రికీ అబ్బడం అరుదు. అమ్మాయిగారు గూడా అలాంటి అవకాశాన్ని ఆయనగారికి అవిచ్ఛిన్నంగా అందజెయ్యడంలో తన పాతి వ్రత్యాన్ని సెంటు పరిసెంటుగా వినియోగిం చింది. తాత్కాలికంగా అప్పుడప్పుడు వొచ్చి పడుతుండే అవసరాలకొద్దీ, అఖిలభారత దేశాన్నీ పాపులేషనులో అగ్రస్థానంలో వుంచేందుకు యథాశక్తిచేస్తున్న సేవకూ ఫలంగా లభించిన ఫలాల్ని పోషించే నిమిత్తా ర్థమై గున్నారావుగార్ని 'పూర్వాభిమానమైనా వొదిలిపెట్టి హెడ్ క్వార్టర్సు మారకుండా వుండే పక్షంలో, నౌకరీ ప్రయత్నంచెయ్య' మని సతపోరింది పాపం. వూరు వొదిలి పోతే యెప్పటి కప్పుడు డొమెస్టిక్ కార్యా లకి హాజరు కావడానికి వీలుండదనీ, తద్వారా ఆయనగారి పత్నీవ్రతానికి లోటు వొస్తుందనీ ఆమె భయం. గున్నారావుగారి అభిప్రాయంగూడా బాహ్యానికి అంతే! వైద్యుడూ రోగీకూడా పాలే కోరారు!

ఎలాగైతేనేం వాహ యమర్జన్సీ సంద ర్భంలో వూళ్ళోనే వో నౌకరీ కుదిరింది కొంత కాలానికి రావుగారికి. కొన్ని నెల్ల పాటు బజార్న పోస్తూ పోతూవుండే పళ్ళ గంపలకీ, పూలబుట్టలకీ, జనారీ సామాన్లకీ, నేతి దుత్తలకీ, పెరుగు బానలకీ గిరాకీ సంపూర్ణంగా కలిగింది. బసవన్న మాత్రం బుసకొడుతూనే పడున్నాడుగాని. శునకరాజు మాత్రం ఆ రోజుల్లో అడపా దడపా పదరు పేజీల్నిగూడా రుచిచూచాడు.

పరిస్థితులు కొంచెంగా మారాయి. కార్యా లయం కస్బాకుమార్చారు. అదికూడా యెంతో దూరంలేదు. కాలి నడక్కు వొక్క గంట తీసుకుంటుంది. యింట్లో ప్రాతఃకాల పూజ ముగించుకొని వెళ్ళితే, ప్రదోష పూజకు కొంప సులభంగా చేరుకోవొచ్చు. పైగా కంట్రాక్టరు యిలావొచ్చి పోతుండటానికి స్పెషల్‌గా ఆజ్ఞకూడా యిచ్చాడు. యీపద్ధతి బాగానేవుందని యిల్లాలు మెచ్చుకుంది. కాని స్వధర్మానికి యీషన్మాత్రం లోపంకలిగినా అది లోపమే; మధ్య మధ్య యింటికొచ్చి వెళుతుండటానికి అవకాశంలేదని కాబోలు, గున్నారావుగారు రాజీనామా బరికేశారు. వెధ వది! యేదైతే మాత్రం స్వధర్మంకంటే యెక్కువా? నూరు వొస్తాయి నూరు పోతా

యి. లోపించిన ధర్మం మరి రావడం సున్నా!

ధర్మపత్ని కాస్త ధమ్కాయించి చూచింది లాభం కలగలా. తిరిగి "రెడ్డొచ్చ మొదలాడు" కిందికి వొచ్చింది సంసారం, అయ్యగారి సంపాదనంతా యేరోజు కారోజు ఆహూతైపోయింది. అయినా సరే గున్నా రావుగారు ధర్మలోపం మాత్రం రాకుండా చూచుకున్నారు.

వుదయవే లేవడం; ముందుగా నీళ్ళ పోయిలో మంటవేసి, కాస్త గృహస్థల సమ్మార్జనం చెయ్యడం; కాఫీకి యెక్కించి, తర్వాత పేరు వరసలా మేలుకొలుపులు పాడి, 'నంజకొడకా' యిత్యాది ఆశీర్వాదాలనుభవిస్తూ అందర్నీ లేపడం; అందరి దేహబాధలూ తీర్పించి, వుదరాబదరా దంత ధావనక్రియ నడిపి కాఫీసేవ చేయించడం; అమ్మవారి టాయిలెట్ పూర్తయేసరికి యేదో కలిగిన మట్టుకి యింత పచనకళా ప్రాగల్భ్యం చూపించి అందరి కడుపులూ చల్లజెయ్యడం; వీరపత్ని విశ్రాంతితీసికొని లేచే లోపల, తిరిగి ఫలాహారం సిద్ధంచెయ్యడం; రాత్రి యధావిధిగా వంటాపెట్టూ అయ్యాక, దర్జాల వారీగా పరుపులు పరవడం; మధ్యే మధ్యే హస్త ప్రక్షాళనం, పాద ప్రక్షాళనం, ఆచమనీయ్యం వగైరాల్ని సరిచూడడం యిదీ—గున్నరావుగారు చేసే 'నిత్యకర్మ.' యెలాంటిపరిస్థితులువొచ్చినా ఆఖరికి పైరళా లాంటిది వూదినా సరే, కార్యక్రమం యధావిధిగా అక్కుల్లడా నడవాలసిందే. యేదైనా కాసంత పొరపాటు వొచ్చేసిందా యింక ప్రళయం జరిగిందన్నమాటే!

ఫార్ ఎగ్జాంపుల్: వోనాడు రావుజీకి అఖండంగా తలనొప్పి వొచ్చేసింది. అన్నీ పన్లూముగించి పక్కలు పరచి తానోవొంక ముడుక్కున్నాడు పాపం. యింత బాధ పడుతువున్నా ఆవిడె గార్ని వోకంట కని పెట్టేవున్నాడు. కాని ఆమెగారి శయ్యను సవరించే విషయం మరచి పోవడమే ఆయన చేసిన మహాపరాధం. భర్తగారు చేసిన యీపాటి ధర్మలోపాన్నిగ్గూడా సహించగల సహనం అమ్మణ్ణిగారికి లేక పోయింది. కంచం ముదర్నించి లేచి వొస్తూనే "యిదే మన్యాయం పడుపు పరవనేలేదే!" అంది.దాని కాయన మూలుగుతూనే తలపగిలిపోతూంది. యివ్వాళకి కాస్త నీవే పరుచుకుందురూ!" అన్నాడు. "నాశనమైన కొంపకి పరుపైనా వొకటివుండి చస్తే. యెలాగైనా యాడవొచ్చు. అన్నీ ముండమోపి జమఖానాలయీ కొంపకి కొరివిచెక్క. యెక్కడికైనా లేచి పోతేనే గాని పీడవొదల్దు" యిలాంటూ మంచం మీద పడున్న జమఖానం మడతను దిండుతోసహా వొక్కతన్ను తన్నింది. అది కోలాహల పర్వతంలా యెగిరి నిద్ర పోతూన్న పిల్లలమీద పడిపోయింది. అందరూ గొల్లుమంటూ గాభరాగాలేచారు. యిప్పుడు గున్నారావుగారికి పిల్లల్ని సమాదా యించి నిద్రబుచ్చటం ముఖ్యమా, మహా ప్రస్థానానికి బయల్దేరుతున్న మదగజ యానను ప్రసన్నపరిచి లోనికి వేంచెప్ప చేసుకోవడం ముఖ్యమా గున్నారావు అనుభవరసికుడు కాబట్టి ఆలోచించవలసిన అవసరం లేకుండానే చటమని వెళుతూన్న భార్యచేయ్యి పట్టుకొని "యిదుగో యెన్నడూ కాబట్టని పరుపు యివ్వాళే కావలసి వొచ్చిందా! యీ మాట యిదివరకే చెప్పంటే 'గానిగెలోదే గంపెడ'ని పరుపు కుట్టించే వేద్దునుగదా! యేదో శిరోభారంతో మరచి పొయ్యా. అదెంత భాగ్యం పరుస్తారా. పిల్లల్ని కాస్త సమదాయించు'' అంటూ పాకులాడాడు.

శక్తి స్వరూపం శాంతించింది. యీ సందర్భంలో మాంచి పచ్చిక సిద్ధపాకంలో కవిత్వం చెప్పే యే భావకవున్నా, బగ్గీనడిపించి బ్రహ్మాండమైన వోకథ రాసుండేవాడు. యింతకూ ఆదంపతుల నామం, చర్యలూ శాశ్వతంగా నిలిచేరోజులేదు.

రోగవో—రాపోవ్వో. కుంటో—కునిష్టో అయితే యేదో యధాశక్తిగా పరిచర్య చేయ్యడం తప్పనిసరి. కాని అయ్యగారు మాటపది పొన్లకు ఎక్కువలేదు. అమ్మగారు చూస్తే మాటయాభైకి తక్కువ లేదు. యిలావున్నా అడుగులకు మడుగు లొత్తుతూ, అనుసరించుకొని నడుచు కుంటూన్నాడంటే దాంట్లో అంతరార్థం యెంతవుండి వుంటుందంటారు!

శయ్య యధావిధిగా అరేంజైపోయింది. యెంత అకస్మాత్‌గాలేచినా నిద్రమైకం కాబట్టి, వో చిన్నకుర్రాడు తప్ప అందరూ నిద్రపొయ్యారు. తొందరగానే. కుర్రాడు మాత్రం కొంపతలకెత్తుకొని యాడవడం సాగించాడు. తండ్రి చాపమీద ముడుక్కున్నాడు తలపోటుతో. తల్లి కనీసప్రయత్నమైనా చేసిందోలేదో పిల్లాణ్ణి శాంతపరచడానికి. కాని రొండు గుద్దులుగుద్ది కులాభివృద్ధికి మంత్రంలావనిచేసే పది పన్నెండు తిటను తిట్టింది. (లం—కొడకా ఇత్యాది) ఆశలేనికూటికి అకల్లేదు కాబట్టి కుర్రాడు యేడిచేడిచి సొమ్మసిలి నిద్రపొయ్యాడు, చివరకి.

యీ గోలతో—యీయేడుపులో—యీ తిట్లతో మునుపే తిరిగి పోతూన్న తల మరీ వాగిపోయింది గున్నారావుకి. కాస్త సద్దుమణగంగానే 'బతికారా భగవంతుడా' అని లోలోపల అనుకొని, వో దీర్ఘ విశ్వాసం వొదిలాడు. కాని భక్తుణ్ణే దేవుడు పరిక్షిస్తాట్ట. అలానే అమ్మణ్ణిగారు అరగజం యెత్తున మంచంమీద శయనించి ''ప్రాణసఖ యేటికిటులన్—ప్రాణానాధ యేటికిటులన్ చింత నొంద గణా ఆ—ఆ—ఆ—ఆ చింత నొంద గణా" అని ప్రారంభించింది. రావుజీ తల మరోసారి అత్యంతవేగంతో గిర్రుమంది. యీపాటతో యిది ముగీదనీ "మగ, వారీనిలానమ్మ, రాదేచెలీ" వరకైనా కనీసం జరిగితీరుతుందనీ గ్రహించి చావ చుట్టుకొని ''వుక్కగావుంది—పాడు'' అని గొణుక్కుంటూ, యెదురింటి అరుగుమీదికి వేంచేశాడు. అంతేగాని పల్లెత్తుమాటకూడా అన్నపాపానపోలా పాపం 'పత్నివ్రతానికి యేదయా పరాకాష్టా? అంటే యిదేనని చెప్పాలి! అంతేనా?

బజార్లో పాతబస్సు టాపుమీద శయనించి, ప్రొబేషనరీ కండక్టరు యేదో పాడుకుంటూ, ఆత్మానందం అనుభవిస్తున్నాడు "——చిన్న సూరిమగడు—గున్నయ్య యెంతమంచివాడే! దాని — పుణ్యాముతో దొరికి—నాడే!

అన్నాము తానేవండు—తాదే!

తిన్నాకునూ దీసు—తాడే!

కల్లాపినీజల్లు—తాడే—!" అంటూ.

విషయం బాగానే అతికిపోయింది, కవిబ్రహ్మ యెవర్నిగురించి యీవిధంగారాసినా, కాని, 'చిన్నసూరి' అన్నచోట 'పెద్దభూరీ' అంటే మా చక్కగా వుండిపోతుందనుకున్నా యీ సందర్భంలో.